
# బంగారునంది

బొజ్జా సత్యనారాయణ



పొడవైన పెద్దబోర్డు చూసి లారీ ఆగింది. బాడీలో ఎద్దులను పట్టుకున్న కొండయ్య బోర్డువంక చూసేడు, "ఆంధ్రప్రదేశ్ ఎడ్ల పోటీలు" అని పెద్దక్షరాలు కొట్టొచ్చినట్టు కనిపించేయి. నందిబొమ్మ ఆకర్షణీయంగా కనిపిస్తోంది. 'కార్యదర్శి వెంకయ్య' అని వుంది. ఎద్దుల పందేలు ఆ పందిరిలోనే జరుగుతాయి కాబోలు అనుకొని కొండయ్య డ్రైవరుతో లారీని లోపలికి పోనీమని చెప్పాడు.

బోర్డు క్రిందనుంచి లారీ లోపలికి వెళ్లింది. బేడ్జీలు తగిలించుకున్న వలంటీర్లు లారీ దగ్గర కొచ్చి, "ఎడ్లను దింపటానికి దిమ్మ అక్కడ ఉంది" అని చూపుడు వ్రేలుతో చూపించగానే, లారీని అక్కడకు పోనిచ్చి, వెనక్కి త్రిప్పి బాడీని దిమ్మకు ఆనించి ఆపాడు, డోరు తెరచి ఎద్దులను దింపాగు కొండయ్య, అతని పాలేరు. వలంటీర్లు చూపించిన పందిట్లో ఎద్దులను కట్టివేసి, సామాను సర్దుతున్న కొండయ్య దగ్గరకు వచ్చిన వ్యక్తి ఎడ్లను పరిశీలనగా చూసి, "ఈ సంవత్సరం ఎడ్ల తయారీ బాగుందండి కొండయ్యగారూ!" అన్నాడు.

"ఏమిటి రెడ్డిగారూ! మీరెప్పుడొచ్చేరు" అడిగాడు కొండయ్య.

"ప్రొద్దుట వచ్చాం. మా ఎడ్లను అటువైపు కట్టివేశాం. భోజనానికి ఈ పూట మా దగ్గర భోంచేదురుగాని రండి" అని చెప్పి రెడ్డి వెళ్లిపోయాడు.

* * *

కొండయ్య చూపులు చుట్టూ పరికిస్తున్నాయి. పది ఎకరాల ఖాళీ స్థలంలో చుట్టూ పందిరి. అందులో పోటీలకు వచ్చిన అరవై జతలవరకూ వున్న ఎద్దులను కట్టివేశారు.

ఆ పందిరి మధ్య నలుపలకలుగా చుట్టూ పందిరి. మధ్య ఖాళీస్థలం. పందిరిలో ఒకవైపు గేలరీ, రిజర్వుడూ, రెండవ వైపు స్త్రీలకు కుర్చీలు. మూడోవైపు నేల, నాల్గవవైపు వేదిక అమర్చివుంది. రెండు మోటబళ్లకు పాలపిట్ట రంగువేసి, తడికలు, తొట్టి లేకుండా ఉన్నాయి. పగ్గం తాళ్లు, ఇసుక బస్తాలు, మూడు సైజుల్లో మూడు పొడుగ్గా ఉన్న నల్లరాళ్లు ఉన్నాయి.

రిజర్వుడు వైపు రెండడగులు లోతు, పదకొండడుగులు వెడల్పు, నూట డబ్బై అడుగులు పొడవు గోతిలో ఇసుకవుంది. దాని పొడవునా పందిరి వుంది. రెండు పందిళ్లకు ఒక ప్రక్కన అయిదు అడుగులు పొడవు, ఎనిమిది అడుగుల వెడల్పు నేలమీద గచ్చు, దాని చుట్టూ కర్రలుపాతి రింగులా వుంది. లైట్లు, నీటి పైపులు, రంగురంగుల శిల్కు జెండాలు, కాఫీ, భోజన హోటలు, కిళ్లీ కొట్లు ఉన్నాయి.

నిగనిగలాడుతూ పల్చని శరీరాలతో నల్లని మూపురాలు, మెళ్లో తలవెంట్రుకల త్రాళ్లు, గంటలున్న ఎలుగుబంటి వెంట్రుకలున్న పట్టెళ్లు, చిక్కాలు తగిలించి ఆబోతులవలె కనిపిస్తున్న వృషభ రాజములు ఒక దాన్నొకటి చూసుకుంటూ పౌరుషాన్ని చూపిస్తున్నట్టు కాలు దువ్వుతూ రంకెలువేస్తూ, చూసేవారికి ఆనందాన్ని భయాన్ని కలగచేస్తున్నాయి బసవన్నలు.

* * *

కమిటీవారు వేదిక దగ్గర కుర్చీలలో కూర్చుని, కార్యక్రమం గురించి చర్చించుకుంటున్నారు. మోటారు సైకిలు చప్పుడు వినిపించి అటు చూసేరు. దానిమీద వెంకయ్యగారు కనిపించేరు. అది దూసుకుంటూ వచ్చి ఆగింది. టెరీకాటన్ తెల్ల చొక్కా, గ్లాస్కోపంచె ధరించిన వెంకయ్యగారి చామన ఛాయ శరీరాన్ని ఆ దుస్తులు తెల్లపరుస్తున్నాయి.

"వెంకయ్యగారూ! మీ హాఫ్ బట్టతలనుండి చెంపలవరకూ కారుతున్న చెమట పిల్లకాలవలా కనిపిస్తోందండీ!" జోక్ విసిరాడు కవి.

"కవిగారికి వర్ణించటానికి ఏమీలేక నా బట్టతలమీద దృష్టిపడింది" అని వెంకయ్యగారు నల్లద్దాల కళ్లజోడు తీసి, రుమాలుతో ముఖం తుడుచుకున్నారు.

"నేను కవిని కానండి. రచయితను"

"మేము అలాగే పిలుస్తామండి"

మైకులో, "రైతు సోదరులకు విజ్ఞప్తి. ఇప్పుడు కమిటీవారు ఎడ్ల కొలతలు కొలుస్తారు. నేను పిలిచినవారు తమ ఎడ్లను తీసుకు వచ్చి రింగులో నిలబెట్టవలెను" అని వినిపించింది.

మూపురం చుట్టూ తాడు చుట్టి, ముక్కుతాడుకి, చిరుముట్టికి కలిపి లాగి కట్టేరు ఎద్దు మొహం పైకి పెట్టటానికి. ముట్టికి రెండు ప్రక్కలా తలపగ్గాలు పెట్టి, చెరోవైపు ఇద్దరు తాళ్ళు పట్టుకుని తీసుకు వస్తున్న ఎద్దు హంస నడకలు నడుస్తూ వస్తూ వయ్యారంగా మూపురం ఊపుతూంది. దానిని రింగులో నిలబెట్టారు. జనాన్ని చూసి రంకె వేస్తూ పౌరుషాన్ని నిరూపించుకుంటున్న ఎద్దును సరిగ్గా నిలబడమని రైతు కసరగానే, నాలుగు కాళ్ళూ సమానంగా నిలబెట్టి ఠీవిగా నిలబడింది.

కమిటీవారు ఎద్దు వెనక మక్క (శీల) వరకూ కర్ర నిలబెట్టి కొలిచి, ఆ కర్రను టేపుతో కొలిచి, పుస్తకంలో నోట్ చేశారు. అలా రెండు రోజులు ఎడ్ల కొలతలు కొలిచారు. వాటిని ఆరు సైజులుగా విభజించారు. ప్రతీ సైజు ఒంటిద్దుకి, జతలకు లాగుడు పోటీలు జరుగుతాయి. మైసూరు ఎడ్లకు ప్రత్యేకించి పోటీ వుంటుంది.

ఎడ్ల కొలతల్లో రైతులకు, కమిటీవారికి మధ్య పేచీ జరిగింది. నలుగురు రైతులు తమ ఎద్దు గత పోటీలో నాల్గవ సైజులో వేశారు, ఇప్పుడు ఐదవ సైజులో వేశారని ఒకరు. ఒకటవ సైజు ఎద్దుల జతను రెండవ సైజులో వేశారని ఇంకొకరు. కమిటీవారు పక్షపాతంగా కొలిచేరని. నాలుగు జతల్ని తీసుకుపోయారు. కమిటీవారు వారికి ఎంత చెప్పినా వినిపించుకోలేదు.

* * *

ఉదయం గోపూజ జరిగింది. ఎం. ఎల్. ఏగారు పాల పళ్లగిత్తల్ని ఇసుక బస్తా ఉన్న బండికట్టి, ఇసుకలో లాగించి పోటీ ప్రారంభోత్సవం చేశారు. అప్పుడు 'వీడియో కలర్ ఫొటో కెమెరా "క్లిక్... క్లిక్" మన్నాయి. మరో వైపు విలేకర్లు.

"మధ్యాహ్నం ఒంటిగంట నుంచి ఎలపటి ఒంటిద్దుల ఇసుక లాగుడు పోటీ జరుగుతుంది పోటీలో పాల్గొనే రైతులు ఇక్కడకు వచ్చి, పేర్లు నమోదు చేయించవలెనని కోరుతున్నాం" అని మైకులో వినిపించింది.

ఎడ్లపోటీ ప్రచారం పల్లెల్లో ముమ్మరంగా చిన్నకారుల్లో చేస్తున్నారు. మధ్యాహ్నం పన్నెండు దాటింది. స్త్రీ, పురుషులు టిక్కెట్టు తీసుకుని పోటీ చూడటానికి ఎవరి తరగతుల్లో వారు కూర్చుంటున్నారు. ఆరోజు జరగబోయే పోటీ ఎడ్ల రైతుల పేర్లు డ్రా తీసేరు. దాపటి ప్రక్కబండికాడి వెనక్కి పోకుండా కాడికి, బండి దొలుపుకి సర్వీబాదు కట్టేరు.

"పది నిముషాల్లో ఆరవసైజు ఎలపటి ఒంటిద్దు ఇసుక లాగుడు పోటీ జరుగుతుంది. ఎద్దును త్వరగా తోలుకురావాలి" మైకులో వినిపించింది.

ఎద్దును తీసుకు వచ్చి బండికి పూన్చి, రెండో వైపు

# బంగారు నంది

కాడిని ఇద్దరు పట్టుకున్నారు. మరో ఇద్దరు బండిక్రింద వొంగుని పోలుకర్రకు చుట్టిన బిడితాడు పట్టుకుని ముందుకు చూస్తున్నారు. ఒకతను ఎద్దుతల తాడు పట్టుకున్నాడు. ఇంకొకతను కొరడా పట్టుకున్నాడు.

"ఎద్దును కొరడా కర్రతో కొట్టకూడదు. కొసతోనే అదలించాలి" మైకు పలికింది."

రిఫరీగార్లు స్టాపు వాచీ బటను నొక్కుతూ విజిలు ఊదగానే బండి కదిలింది. ఇసుకలో ఎద్దుబండిని హుషారుగా లాగుతూంది. దానికి కాడి పట్టుకున్న వారు, బండిక్రింద వంగున్నవారు సాయంచేస్తూ ఉన్నారు. ఆ చివరకు వెళ్లగానే ఆపి ఎద్దు నోట్లో నీళ్ళుపోసి, వెనక్కి త్రిప్పి మళ్లీ లాగిస్తుంటే ప్రేక్షకులు ఉత్సాహంగా చూస్తున్నారు. రిఫరీగారు చెయ్యి పైకెత్తి చూపుడు వ్రేలు వేదిక వైపు చూపించగానే మైకులో, "బండి బయలుదేరి నిముషమయింది" అని వినిపించింది. కమిటీలో ఒకరు కర్రపట్టుకుని బండి వెనకాల నడుస్తున్నాడు. ఇంకొకతను టేపు పట్టుకున్నాడు. ఎద్దు ఇట్నుంచి ఆ చివరకు. అట్నుంచి ఈ చివరకు లాగుతూ మధ్య మధ్య ఆగుతుంటే కేకలుతో అదలిస్తున్నారు. ఆరు నిముషాలవగానే విజిలు వినిపించగా కర్ర పట్టుకున్న వ్యక్తి చక్రం వెనకాల కర్ర నిలబెట్టాడు–ఆనవాలుగా. కర్రగుచ్చిన దగ్గరనుంచి, హద్దువరకూ టేపుతో కొలిచి, పుస్తకంలో నోట్‌చేశారు ఎద్దు ఎన్ని అడుగుల దూరం లాగింది.

"ఏడువందల ఎనభై తొమ్మిది అడుగుల మూడు అంగుళాలు దూరం లాగింది" అని మైకులో చెప్పారు ఎద్దు వేసిన పేడ తీసివేసి, కూలీలు పారలతో ఇసుకలో పున్న చక్రాల బాటను ఇసుక దొలుస్తూ కప్పెడుతున్నారు అలాగే ఎలపటి ఒంటిద్దుల ఇసుకలాగుడు పోటీలు మూడు రోజులు జరిగాయి. ఒంటిగంటనుండి, సాయంత్రం ఆరు గంటలవరకూ జరుగుతాయి. సర్కస్ లా మధ్యలో పోటీలు జరుగుతూంటే జనం చుట్టూ కూర్చుని ఉత్సాహంగా చూస్తున్నారు

* * *

అరుణోదయానికి ముందే రైతులు లేచి, వారి వారి ఎడ్లను ఆవరణలో చుట్టూ త్రిప్పుతున్నారు. వాటికి నరాలు సాగటానికి. ఎవరి ఎడ్ల జతలను వారే పోటీకి బాగా కృషిచేసి తీసుకువచ్చేరు. ఇప్పుడు వాటిని బండికట్టనివ్వరు. పోటీలోనే కట్టాలి. అందుకు ఎడ్లకు కాళ్ళు సాగటానికి, ప్రొద్దుట, సాయంత్రం త్రిప్పుతుంటారు. వాటికి మాలీష్‌చేసి, ఉడుకు నీళ్లగుడ్డ ముంచి కాపడంపెట్టి, కడుగుతున్నారు. పాలు, కోడిగుడ్లు పట్టిన తరువాత, ఉడకబెట్టిన ఉలవలు దుమ్మి, ఉండలు చుట్టి తినిపిస్తున్నారు. గ్లూకోజ్, కొబ్బరినీళ్ళు, చోడి అంబలి, జొన్నపిండి కలిపిన నీరు వగైరాలు సాయంత్రం వరకూ పడుతున్నారు. బడలిక తగ్గటానికి మందులు కూడా వాడుతున్నారు. జొన్న, పిల్లిపెసర, జనుము కలిపి ఉన్న ఎండు చొప్పతో ఎడ్లను మేపుతున్నారు. కమిటీవారు నియమించిన వెటర్నరీ డాక్టరు రెండుపూటలూ వచ్చి ఎడ్లను పరీక్షించి వెళుతున్నారు. ఆపట్నంలో నివశించే వారిలో కొందరు వచ్చి, ఉలవలు నీరు పట్టుకు వెళుతున్నారు 'చారు' కాచుకోవడానికి.

బసవన్నల రంకెలు, మువ్వల సవ్వడులు, రైతన్నలు వాటికి చేసే పరిచర్యల సందడితో పోటీ ప్రదర్శన గోకులాన్ని మరిపిస్తూంది.

* * *

రోజూ జరిగే పోటీల న్యూస్‌తోపాటు ఎద్దుల ఫొటోలు కూడా విలేకర్లు పేపర్లలో ప్రచురిస్తున్నారని, ప్రారంభోత్సవం చేయించిన తనగిత్తల ఫొటోను పేపర్లలో వేయించలేదని ఆ రైతు కమిటీవారిమీద అలిగి గిత్తల జతను తోలుకుపోయాడు.

"ఈరోజు జోడెడ్ల ఇసుక లాగుడు పోటీలు జరుగుతాయి. ఎడ్ల జతలను పోటీకి సిద్ధం చేయమని కోరుతున్నాం. మరో ముఖ్య గమనిక. ఈ ఎడ్ల పోటీలను వెంకయ్యగారు సావనీరు ప్రచురించటానికి సంకల్పించారు. సావనీరు రూపకల్పన చేయటానికి ఎడ్లపోటీ కవిగారు అంగీకరించారు. ఎడ్లపోటీ విజేతలు గతంలో పోటీల్లో గెల్చుకున్న వివరాలు కవిగారికి తెలియపర్చమని కోరుతున్నాను" అని మైకులో వినిపించి, వెంకయ్యగారి నిర్ణయానికి ఆనందించేరు.

"ఎడ్లపోటీ కవి ఎవరు"

"ఆకవి ఒకప్పుడు ఎడ్లపరుగు పోటీ విజేత. ఆయన ఆంధ్రప్రదేశ్ ఎడ్లపోటీ విజేతల చరిత్ర రాసి, సాహిత్యం ద్వారా పాఠకులకు అందిస్తున్నందుకు ఆయన పేరు అలా పెట్టారు." కొండయ్య ప్రక్క రైతుతో చెప్పాడు.

* * *

ఇసుక బస్తాలున్న బండికి జత ఎడ్లను కట్టి ఇసుకలో ఆరు నిముషాలు లాగించారు. జనం వేసే ఈలలు, అరుపులకు ఎద్దులు హుషారుగా పెద్ద పెద్ద అంగలువేస్తూ మెళ్లోగంటల మోతల మధ్య లాగుతూ తమ జవసత్వాలను నిరూపిస్తూ చూసేవారికి ఉత్సాహాన్ని రేకెత్తించాయి. అలాగే సైజును బట్టి బరువువేసిన బండిని ఆరుసైజుల ఎడ్ల జతలతో మూడురోజులు పోటీలు జరిగాయి. కొండయ్య జతను జరిగిన పోటీల్లో ప్రవేశపెట్టలేదు. అన్ని సైజుల పోటీలలోనూ పాల్గొంటే ఎద్దు నలిగిపోతాయని. బండి పూటీ లాగుడులో పాల్గొనపెట్టి ఎక్కువ దూరం లాగించి, పోటీలు బహుమతి బంగారు నందిని గెలవాలని తలంపుతో ఉన్నారు కొండయ్య.

వేదికమీద కూర్చుని కవిగారు ఒకవైపు పోటీలను తిలకిస్తూ, మరో వైపు సావనీరుకి వ్యాసాన్ని రాయడం మొదలు పెట్టారు. "ద్వాపరయుగంలో కోసల దేశాన్ని పాలించిన నగ్నజితుడనే మహారాజు కుమార్తెకు వివాహం తలపెట్టి, తనదగ్గర ఉన్న

బలమయిన ఏడు ఆబోతులతో పోరాడి, వాటిని జయించిన రాకుమారునకు తన కుమార్తె నిచ్చి వివాహం జరిపిస్తానని స్వయంవరం ప్రకటించాడు." అని కవికలం సాగుతూంది.

కమిటీవారు పోటీలు జరిపిస్తూ, మరో వైపు విరాళాలు వసూలు చేస్తున్నారు. ఎక్కువ విరాళం యిచ్చిన వారి పేరున బహుమతులు చదివించాలని నిర్ణయించుకున్నారు. పోటీ ఖర్చులకు లక్షా ఏభైవేలు వరకూ అవుతాయని కలక్షను వసూలు అవుతుందా లేదా అని వెంకయ్యగారికి అనుమానం వుంది.

ఒంటెద్దు లాగుడు పోటీలో కాడిపట్టుకుని ఎద్దుతో లాగేవారు ప్రత్యేకంగా ఉంటారు. వారికి ఎద్దుతో లాగినందుకు రైతులు ప్రతిఫలం ఇస్తారు పోటీ నెగ్గితే ఎక్కువగా యిస్తారు. కొండయ్య ఒంటెద్దు పూటీలాగుడులో తన ఎద్దుతో కాడిలాగటానికి మనుషులను నియమించాడు.

"ఈ రోజు ఒంటెద్దు బండి పూటీలాగుడు పోటీ జరుగుతుంది". మైకులో వినిపించింది.

ఈపోటీ కూడా అన్ని సైజుల ఎద్దు జతలకు వుంటుంది. సైజును బట్టి బండిలో బరువువేసి లాగిస్తారు గట్టి నేలమీద చక్రాలు దొర్లకుండా కట్టి. ఈ పోటీ కూడా ఆరు నిముషాలు వరకూ లాగిస్తారు. కొండయ్య ఎద్దును తీసుకు వచ్చి బండికి కట్టేరు. ఇద్దరు రెండవ వైపు కాడి పట్టుకున్నారు. ఇద్దరు బండికింద వంగుని బిడితాడు పట్టుకుని ముందుకు చూస్తున్నారు.

రిఫరీగారి ఆజ్ఞతో బండి కదిలింది. ఎద్దు హుషారుగా లాగుతూ రెండవ హద్దు సమీపిస్తుందనగా పడుకుంది. కొండయ్య ముఖం అవమానంతో మాడిపోయింది.

"తెల్లరెప్పల ఎద్దుకి కన్నుపిరికి ఉంటుంది" అన్నారు ఒకరు.

"ఎద్దును వారంరోజుల నుంచి సుఖపెట్టడంవల్ల దానికి ఒగుర్పొచ్చి పడుకొంది." అని మరొకరు తలావొక రకంగా ఎద్దు గురించి చెప్పుకున్నారు. ఎంత ప్రయత్నించినా ఎద్దు లేవలేదు. ప్రేక్షకులలో నుంచి ఎద్దు చెవిలో నీళ్లు పొయ్యమని వినిపించగానే దాని చెవుల్లో నీరు పోసేరు. ఎద్దు లేచి నిలబడింది. పోటీ టైము అయిందని రిఫరీగారు విజిలు ఊదారు.


మళ్లీ పోటీలో లాగించటానికి అనుమతివ్వమని. కొండయ్య అడిగాడు. పోటీలో వదిలిన తరువాత మళ్లీ ఆ పోటీలో దానిని కట్టకూడదని రిఫరీగారన్నారు. ప్రేక్షకుల్లో కూడా కొందరు లాగించాలన్నారు. కొందరు మళ్లీ కట్టించి పోటీ నిబంధనలను ఉల్లంఘించకూడదన్నారు. వారిలో వారికి ఘర్షణ పెరిగి కుర్చీలను పైకి లేపా రు. వారిని కమిటీవారు సముదాయించేరు. కొండయ్య ఎద్దును తీసుకుని బయటకు నడిచాడు.

ఇంకొక రైతు ఎద్దును తోలుకు వచ్చి బండికట్టి లాగిస్తున్నారు. బండి ఈ హద్దునుంచి, రెండో హద్దుకి వెళ్లగానే బండి ఆపి పది సెకండ్లు నిలబెట్టి, మళ్లీ లాగిస్తూ ఎద్దుకు అలసట లేకుండా నడిపిస్తున్నాడు రైతు. ఎద్దు ఆగకుండా ఉడాయింపుతో లాగుతూ జనాన్ని రంజింపచేస్తూ వుంటే, వారు అరుపులతో ఆ వృషభ రాజమునకు మరింత ఉత్సాహాన్ని ఉసి గొలుపుతున్నారు. అప్పటివరకూ, జరిగిన పోటీలో ఎద్దు లాగిన దూరంకంటే ఈ ఎద్దు అత్యధిక దూరం లాగించి కమిటీ వారి ప్రశంసలు పొందాడు రైతు.

ఒంటెద్దు ఎలపటి దాపటి పూటీ లాగుడు పోటీలు రెండు రోజులు జరిగాయి.

* * *

ప్రతీరోజూ జరిగే పోటీలు ఆఖరున అన్నదమ్ముల ఎద్దు జత, బండి బోల్తా వేయడం, మళ్లీ యధాలాపంగా తీయడం. పడుకోవడం; లేవడం; ఎదుటిమనిషిని పొడవమంటే పొడవటం మొదలగు విద్యలను ప్రదర్శిస్తూ, అనేక విన్యాసాలతో ప్రేక్షకుల మన్ననలు పొందుతున్నాయి ఆ ఎద్దు జత.




"ఈ రోజు జోడెద్దు బండి పూటీ లాగుడు జరుగుతుంది, ఇప్పుడు పోటీలో లాగబోయే జత గతంలో చాలా పోటీలు గెల్చుకున్నాయి." అని మైకులో వినిపించింది.

ఎద్దును బాగా తోలి ఎక్కువ దూరం లాగించి, బంగారునందిని గెల్చుకోవాలని కూడ బలుక్కుని ఎద్దుజతను తీసుకువచ్చి బండి కట్టేరు. బండిని హద్దుల్లో ఆపకుండా పోనిస్తున్నారు. ఎద్దుగలవారు హడావిడి, ఆడంబరం చేస్తూ ఎద్దులను అదలిస్తున్నారు. వారి తీరు తెన్నులు చూసి కమిటీవారు ఎద్దుల మీద కొరడా కర్ర తగులుతుందేమోనని జాగ్రత్తగా చూస్తున్నారు. టైము నిముష ముందనగా ఆగిపోయాయి. ఎద్దుగలవారు ఎంత అదలించినా బండిని కదలించలేకపోయాయి. అదుర్దాగా ఎద్దును ఆపకుండా తోలినందువల్ల, అవి ఒగుర్పుకు తట్టుకోలేక పోయాయని బాధపడ్డారు. జోడెద్దు పూటీ లాగుడులు రెండు రోజులు జరిగాయి.

* * * * * * *

బండలాగుడు పోటీ జరిగేటప్పుడు ఎద్దుకు ఎండతగలకుండా షామియానాలు అమర్చారు. ఒకటవ సైజు బండ పదిహేడువందల ఇరువై కేజీల బరువువుంది. రెండుగజాలు పొడవు, అయిదు అడుగుల ఎత్తు నల్లరాయి. దానికి రెండు చివర్లా బెజ్జాలకు తీగె చుట్టి వుంది. ఆ తీగెకు కాడికి తాడుకట్టి లాగిస్తారు అరగంటసేపు.

ఎద్దు జతను తీసుకు వచ్చి బండకాడికి కట్టి రిఫరీగారి ఆజ్ఞతో లాగిస్తున్నారు. ఆబిరి హద్దు దగ్గరకు, ఈ బిరి హద్దు దగ్గరకు లాగుతున్నాయి. హద్దు బిరిజేరగానే ఎద్దును ఆపి వాటినోట్లో నీళ్లు పోస్తున్నారు. ఎద్దుజత మెడకల్పి సమానంగా లాగితే బండను సునాసంగా హద్దుకి లాగుతున్నాయి. ఉమ్మడి పట్టుపట్టిలాగితే ఐదారు గజాలకంటే ఎక్కువ దూరం లాగలేకపోతున్నాయి. మళ్లీ కొన్ని క్షణాలు ఆగిపోతున్నాయి. ఎద్దులువేసే అడుగులు, మూపురాల కదలికలు చూసేవారికి ఆసక్తిని కలిగిస్తున్నాయి.

పుచ్చకాయపేడు తిని పాప అవతలకు విసిరితే అది మరొకామె ఒడిలోపడి చీరను డాగు పరచింది. ఆపేడును తీసిబయటపడేస్తూ, "చీరపాడు చేశావు గాలిగాయిదానా!" అని ఆమె పాపను కసిరింది. పాపతల్లి ఆమెవంక కొరకొరా చూస్తూ, "ఏవమ్మా! చిన్నపిల్ల తెలియక పడేసింది ఆ మాత్రం దానికి గొడ్రాలిలా విసుక్కుంటావేవిటి."

"నేను గొడ్డురాలినని నీకు తెలుసా. నీపిల్ల నీకు ముద్దు" అని ఇద్దరూ జడలు పట్టుకునేవరకూ వచ్చేరు. వలంటీర్లు వారిని ప్రసన్నులను చేశారు.

మూడు రోజులు బండలాగుడు పోటీలు జరిగాయి.

* * *

ఇంక జాక్‌పాట్ పోటీలు, ఎద్దుపరుగు, అందాల పోటీలు జరగాలి. పోటీలో ఎద్దుపడుకుని అవమానం పొందిన కొండయ్య ఎద్దుజతను తన ఊరు తీసుకుపోవాలని, పాలేరుతో సామాను సిద్ధం చేయమని చెప్పి, రాటకు జేరబడి ఎద్దువంక చూస్తున్నాడు. తనకు బంగారు నంది గెలిసేయోగం లేదని. ఎంతో ఆశతో ఎద్దును మేపి దానికి బండిలాగుడు కృషిచేసి, ఆ ఎద్దులాగే తీరు చూసి పోటీలో గెలవవచ్చుననే ధీమాతో ఎద్దుజతను తీసుకువచ్చేడు కాని తన ఊహ బెడిసి కొట్టిందని కొండయ్య మధనపడుతూ ఎద్దు వంక చూస్తున్నాడు.

ఆ ఎద్దు చెవులు నిక్కబొడిచి మిర్రున చూస్తున్న వైపు చూసేడు. గుబ్బగొడుగు ఎక్కుపెట్టి మరో ఎద్దును చూస్తున్న వ్యక్తిని చూసేడు కొండయ్య. తన ఎద్దు గుబ్బగొడుక్కి బెదురుతుందని గ్రహించి అతని మదిలో ఏదో తళుక్కున మెరిసింది. పాలేరుతో సామాను సర్దవద్దని చెప్పాడు.

విరాళాలు, టిక్కెట్లు కలెక్షన్‌లు బట్టి చూస్తే చాలా డబ్బు నష్టం వచ్చేటట్టుందని కమిటీవారికి గంగిర్లు పుట్టాయి. నష్టం వచ్చినా బహుమతులు ఇవ్వడంలో లోపం రానివ్వకూడదని వెంకయ్యగారు

కమిటీవారితో చెప్పారు.

ఆరుసైజుల ఎడ్లజతలను మూడు సైజులుగా విభజించారు. ఆ మూడు సైజుల ఎడ్లకి జరిగిన పోటీల్లో వేసిన బర్వుకంటే అదనంగా బరువువేసి లాగిస్తారు. దీనిని జాక్‌పాట్ పోటీ అంటారు. కొండయ్య ఎద్దును ఒంటెద్దు ఇసుకలాగుడు జాక్‌పాట్ పోటీలో ప్రవేశపెట్టాడు. అతను నల్లదుస్తులు ధరించాడు. ఆ దుస్తులను చూసి కొందరు, "అయ్యప్పస్వామి!" అంటున్నారు.

తలతాడు పట్టుకొని, రెండో చేత్తో కొరడా త్రిప్పుతూ ఎద్దు ప్రక్కన నడుస్తున్న కొండయ్యను ఒక కన్నుతో చూస్తూ, రెండో కన్ను ఎదురుగా చూస్తూ ఎద్దు పెద్ద పెద్ద అంగలువేస్తూ బండిలాగుతూంటే చూసేవారు మహదానంద పడుతున్నారు. నల్లగుడ్డకు బెదిరి ఎద్దులాగు తూందని అనుకున్నారు. ఎద్దులో అంత విద్య ఉండబట్టే రైతు పోటీలో పాల్గొన్నాడు కొండయ్య. జనంలో గోల మరింత ఎద్దుకు బలాన్ని చేకూర్చుతూంది. అది సునాసంగా లాగుతూ విజిలు వినగానే ఆగిపోయింది. ఎద్దు లాగిన దూరం వినగానే జనంలో హర్షధ్వానాలు మిన్నుముట్టాయి. కొండయ్య ఆనందం అవధులు దాటేయి.

ఒక జత లాగిన వెంటనే రెండో జతను పోటీలో "త్వరగా కట్టకుండా ఆలస్యం చేస్తున్నారు కమిటీవారు. పోటీలను పొడిగించటానికి" అని నేలనుండి కేకలు వినిపించాయి.

# బంగారు నంది

"కమిటీవారు కావాలని ఆలస్యం చెయడంలేదు. ఎడ్లను త్వరగా తీసుకు రమ్మని మైకులో పిలవడం మీరు వింటున్నారు. అయినా ఎడ్లగల రైతులు తీసుకురావడం ఆలస్యం చేస్తున్నారు" అని మైకులో వెంకయ్యగారు మాట్లాడగానే మంత్రించి నట్టు నేలలో అలజడి ఆగిపోయింది. జాక్‌పాట్ పోటీలు కూడా ముగిశాయి.

★ ★ ★

రెండు పందిళ్లకు మధ్య కాళీ చట్టూ, నాలుగు గజాల వెడల్పున కర్రలు పాతివాటికి తాళ్ళు చుట్టేరు. దానిమధ్యన ఎడ్ల పరుగుపోటీలు జరుగుతాయి. అన్ని సైజుల ఎడ్లకు ఒకటే పోటీ జరుగుతుంది. ఒక బండిని విడిచిపెట్టి, వెళ్ళి వచ్చిన తరువాత మరో బండిని విడిచిపెడతారు. ఈ పోటీలో ఎక్కువగా మైసూరు జతలు పాల్గొన్నాయి.

టాపులేని చక్రాలకు టైర్లు మర్చిన గచ్చకాయ రంగు సవారీ బండికి మైసూరు జతను పూన్చి తీసుకువచ్చి ముగ్గుమీద నిలబెట్టారు. బండితోలే ఇద్దర్ని రిఫరీగారు చెకింగు చేశారు. వారి దగ్గర మేకైనా, బ్లేడయినా ఉంటుందేమోనని. ఇద్దరూ బండి ఎక్కారు. ఒకరు తొట్టిదగ్గర కూర్చుని తలపగ్గాలు వెనక్కిలాగి పట్టుకున్నాడు. రెండవ వ్యక్తి బండి మధ్య ఒంగొని రెండు ప్రక్కల గడికొయ్యలు పట్టుకున్నాడు.

రిఫరీగారి ఆజ్ఞతో గిత్తలు ఉరకలు పరుగులుతో ముందుకు దూసుకుపోతున్నాయి. జోరుగా దొర్లుతూ వున్న బండి చక్రాల మీద ఎండ పొడపడి ఆకులు మిలమిలా మెరుస్తూ చూసేవారికి కనులు మిరిమిట్లు కొలుపుతున్నాయి. గిత్తల ఉరకలు చూసి ఆనందం పట్టలేక ఈలలు, కేరింతలువేస్తూ వాటికి మరింత ఉత్సాహాన్ని ఉసుగొలుపుతున్నాయి. పందిరి చుట్టూ వున్న రింగులో రెండుసార్లు ఉరికించారు. వాటిటైము నోట్‌చేసి రెండో బండిని విడచి పెట్టారు. పరుగు పోటీలో పాల్గొన్న జతలు ఒక్కొక్కటి వెళ్ళివచ్చి, పోటీలను ముగింపచేశాయి.

★ ★ ★

ఉదయం ఎడ్ల అందాల పోటీలు జరిగాయి. సాయంత్రం వ్యవసాయ శాఖామాత్యులు వేదికను అలంకరించి, పశుపోషణ గురించి, ఎడ్లపోటీల గురించి మాట్లాడారు. అనంతరం పోటీలో ఎడ్లను నేర్పిరి తనముతో తోలిన వారికి, రిఫరీగారికి, కవిగారికి సన్మానాలు జరిగిన పిమ్మట బహుమతి ప్రదానోత్సవం జరిగింది. పోటీలో పాల్గొన్న అన్ని జతలకంటే అత్యధిక దూరం లాగిన కొండయ్య ఎద్దుకు బంగారునంది లభించింది. పోటీ ఖర్చుల నిమిత్తం వెంకయ్యగారి జేబులో పదివేల రూపాయలవరకూ ఖాళీ అయ్యి ఉంటుందని కమిటీవారు అనుకోవడం విన్న కొండయ్య బాధపడకుండా ఉండలేకపోయాడు. □